క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాల్కొండ: ముప్కాల్ మండల ఎంపీడీవోగా బాల గంగాధర్ రాజు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన ఎంపీడీవో ముజాఫర్ రోడ్డు ప్రమాదంలో నాలుగు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఎంపీడీవో పోస్ట్ ఖాళీగా ఉండగా, బోధన్ మండలం నుంచి బాల గంగాధర్ రాజు డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారు.

న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్ కుమార్ కోరారు. పట్టణంలోని కోర్టు ప్రాంగణంలోగల బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం న్యాయవాదులకు హెల్త్ కార్డుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు హెల్త్ కార్డులను మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, గంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌కు హెల్త్ కార్డులను అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి



పెర్కిట్/బాల్కొండ: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని మోడల్ స్కూల్స్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. పెర్కిట్, బాల్కొండలోని మోడల్ స్కూల్స్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విదార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను, బోధన తీరును పరిశీలించారు. ఈసంద్భంగా జేడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కాగా మోడల్ స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న పీఈటీ, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచ్‌మెన్లకు గత ఆరు నెలలుగా వేతనాలు రావడం లేదని ఉద్యోగులు జేడీకి వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్స్ శ్యామ్, శ్రీనివాస్ ప్రసాద్, ఎస్‌వో భవాని, పీఈటీ గంగాదాస్, ప్రేమ్, చాయాదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం బాచనపల్లికి చెందిన మాజీ సర్పంచ్‌లు బనారం నర్సయ్య, కే హన్మండ్లు, మాజీ ఉప సర్పంచ్ పత్తిమల బాలయ్యలతోపాటు మరో 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో సోమవారం వారికి పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విధుల్లో అలసత్వం తగదు



ఆర్మూర్: 108 సిబ్బంది విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దని ఆర్మూర్ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. నందిపేట మండలంలో 108 వాహనాన్ని సోమవారం ఆయన తనిఖీ చేసారు. వాహనంలో రికార్డులను సైతం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పలు సూచనలిచ్చారు. మండల వైద్యాధికారి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

గణేష్ నవరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

ఆర్మూర్/బాల్కొండ: గణేష్ చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సూచించారు. నందిపేట మండల కేంద్రంలో ఎస్సై శ్యామ్‌రాజ్ అధ్యక్షతన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సోమవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో సీఐ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నవరాత్రులు, నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను, జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు. అనంతరం బాల్కొండ పోలీస్ స్టేషన్‌లోనూ శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్సై శైలెందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- బోధన్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు
- పలు గ్రామాల్లో నీట మునిగిన పొలాలు



హంగర్గ శివారులోని పంటపొలాల్లో వరద నీరు



బోధన్‌లోని తట్టికోట్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

బోధన్‌టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బోధన్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వెంకటేశ్వర కాలనీ, సరస్వతీ నగర్, తట్టికోట్ రోడ్డు, రాకాసీపేట్‌లోని పలు కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోని పురాతన భవనం (క్యాంటీన్) ఓ పక్క కూలింది. వార్డులతోపాటు లోతట్టు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, సానిటేషన్ అధికారి గణేష్ పర్యటించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

వర్ని: మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లడంతో వ్యవసాయ పొలాలు నీట మునిగాయి. పాత వర్ని శివారులో వాగుకు భారీ వరద రావడంతో 100 ఎకరాల్లో పొలాలు నీట మునిగా యి. సైదిపూర్ చెరువు అలుగు పోర్లడంతో జలాల్పూర్ బడా పహాడ్‌కు రాకపోకలు నిలిచిపోయాయి.

వేల్పూర్: మండలంలో ఉన్న కప్పలవాగు, పెద్దవాగు జలకళను సంతరించుకున్నాయి. దీంతో అక్లూర్, మోతె, రామన్నపేట్ గ్రామాల వద్ద ఈ వాగుపై ఉన్న చెక్‌డ్యాంలు మత్తడి దూకుతున్నాయి. పెద్దవాగుకు స్వల్పంగా వరద రావడంతో జాన్కంపేట్, పచ్చలనడ్కుడ చెక్‌డ్యాంలు నిండాయి.

రుద్రూర్: మండలంలో 176 మీ.మీ వర్షం కురిసింది. రాజీవ్‌నగర్ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు నీటిని ఎత్తిపోయడానికి తీవ్రంగా శ్రమించారు. మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని, వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలో ఆరు ఇళ్లు దెబ్బతిన్నట్టు తహసీల్దార్ తారాబాయి తెలిపారు. ఎస్సై సాయన్న వివిధ గ్రామాల్లో పర్యటించి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు. రాణంపల్లి చెరువు పూర్తి సామర్థ్యంతో నిండి చెరువు కట్టకు సమతంగా నీరు వచ్చి చేరింది. దీంతో తూము తీయడానికి సిబ్బంది రెండున్నర గంటల పాటు తీవ్రంగా శ్రమించారు. తూము మొరాయించడంతో సమీపంలో చెరువు అలుగును మరింత తవ్వి మిగులు జలాలు బయటకు పంపిస్తున్నారు.



రుద్రూర్-జవహర్‌నగర్ కాలనీ రోడ్డుపై రాకపోకలు నిలిపివేసిన సిబ్బంది



బొప్పాపూర్- రుద్రూర్ రహదారిపై..

కోటగిరి(రుద్రూర్): కోటగిరి మండలంలో వర్షాలకు ఆరు ఇళ్లు దెబ్బతిన్నాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. పోతంగల్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గంగాధర్ కోరారు.

బోధన్‌రూరల్: మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో తహసీల్దార్ విఠల్, ఎస్సై మచ్చేందర్ రెడ్డి పర్యటించి మంజీర నది ఉధృతిని పరిశీలించారు. మంజీర నది ఉధృతి పెరుగుతుండటం, శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ వల్ల హంగర్గ గ్రామం ముంపునకు గురయ్యే నేపథ్యంలో జాగ్రత్తలపై స్థానిక అధికారులు, ప్రజలకు పలు సూచనలు అందించారు.



అనిల్ టాకీస్ రోడ్డులో..



పాత వర్ని శివారులో పొంగిపొర్లుతున్న వాగు



పడగల్ చెరువును పరిశీలిస్తున్న అధికారులు



ఖండ్‌గావ్ బ్రిడ్జి వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న అధికారులు

బోధన్: ఎడపల్లి మండలం మంగల్‌పహాడ్ గ్రామంలో సోమవారం ఐదు పెంకుటిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జీపీ కార్యదర్శి రామిరెడ్డి గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు.



రుద్రూర్ పునరావాస కేంద్రంలో ఉన్న వారికి భోజనం అందజేస్తున్న సిబ్బంది



రుద్రూర్‌లోని రాజీవ్ నగర్ కాలనీ రోడ్లపై వరద



బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో కూలిన క్యాంటీన్



సులేమాన్‌నగర్‌లో కూలిన ఇల్లు



పాత వర్ని శివారులో నీట మునిగిన పొలాలు

ఇళ్ల మధ్య నిలిచిన వర్షపునీరు..



మామిడిపల్లిలో జనావాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి విలీన గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురికినీటితోపాటు వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో ఆయా కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం నిలిచిపోతున్న నీటిని తొలగించడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నిలిచిన నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందడమే కాకుండా బోరు బావులు మురికి నీటితో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ప్రజలు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తం చేశాం

వర్షాల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి సమస్యలను పరిష్కరిస్తున్నాం. పారిశుధ్య సిబ్బందితో నీరు నిల్వ లేకుండా చూస్తున్నాం. అలాగే సానిటేషన్ అధికారులు కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

తాళ్లరాంపూర్ గ్రామస్తులకు జిల్లా జడ్జి అభినందన

నిజామాబాద్ లీగల్: బాల్కొండ నియోజకవర్గం తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీని రద్దు చేసుకున్న గ్రామస్తులకు జిల్లా జడ్జి జీవీఎస్ భరతలక్ష్మి, జిల్లా న్యాయసేవ సంస్థ కార్యదర్శి ఉదయభాస్కర్ రావు అభినందించారు. వీడీసీని రద్దు చేసుకున్న సందర్భంగా తాళ్లరాంపూర్ గ్రామస్తులు సోమవారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వారిని కలిశారు. ఈసందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. అధికారం, ధనబలంతో చేసే ఆధిపత్యం అంతంకాక తప్పదని, సామాజిక వెలివేతలు సమాజ ఉన్నతికి ఉపయోగపడవని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా ఉండి పల్లెల ప్రగతికి వారదులుగా నిలవాలని సూచించారు. తాళ్ల రాంపూరు వీడీసీ రద్దు మహిళలు సాధించిన విజయమని అభివర్ణించారు. న్యాయసేవా సంస్థ అనేది అందరికి సమన్యాయం అందించేందుకు తనవంతు పాత్ర నిర్వహిస్తుందని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయభాస్కర్ రావు అన్నారు. అనంతరం జడ్జికి గ్రామస్తులు మొక్క అందజేసి, సన్మానించారు. మాజీ సర్పంచ్ రామాగౌడ్ తదితరులు ఉన్నారు.



జిల్లా జడ్జికి మొక్క అందజేసి, సన్మానిస్తున్న తాళ్లరాంపూర్ గ్రామస్తులు

సమయపాలన పాటించాలి



బోధన్: వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రోగుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రవేశ పెట్టిన వైద్యారోగ్యసేవలకు సంబంధించిన వివిధ పోర్టల్‌ల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు.

షీటీంకు ఫిర్యాదు చేయాలి

వేల్పూర్: విద్యార్థినులు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్, ఆర్మూర్ డివిజన్ షీటీమ్ కానిస్టేబుళ్లు విఘ్నేష్, సుమతి అన్నారు. మండలంలోని పచ్చలనడ్కుడ కస్తూర్బా పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు షీటీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాధితులు షీటీం నంబరు 8712659795కు లేదా, డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం షీటీం స్టిక్కర్స్‌ను ఆవిష్కరించారు. కేజీబీవీ ఎస్‌వో వినోద, టీచర్లు పాల్గొన్నారు.



షీటీం స్టిక్కర్స్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



దేగాంలో పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గౌడ కులస్తులు

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో గౌడ సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను ఎదుర్కోవడంలో పాపన్న గౌడ్ పోరాట పటిమ మరవలేనిదన్నారు. ప్రజలను ఐక్యం చేయడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు.



నందిపేటలో..



బాగేపల్లి గ్రామంలో..



ఏర్గట్ల మండల కేంద్రంలో..



మోర్తాడ్‌లో..



ముప్కాల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో..



బాల్కొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



ఆర్మూర్‌లో..



సాలూర మండల కేంద్రంలో..



మాక్లూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో..

ఆధ్యాత్మికం..

వర్షంలో భక్తుల పాదయాత్ర



బోధన్: శ్రావణ మాస ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయానికి సోమవారం సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్ గ్రామస్తులు వర్షంలోనే కాలినడక పాదయాత్రగా తరలివెళ్లారు. సుమారు 12కి.మీ నడిచి శివాలయాని చేరుకున్నారు. సాలూర క్యాంప్ గ్రామం వద్ద హున్సా సొసైటీ చైర్మన్ మందర్నా రవి భక్తులకు పండ్లు పంపిణి చేశారు. హెచ్‌ఎం ఇల్తెపు శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సుబాష్ పటేల్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై గల శివాలయంలో శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భజన మండలి సభ్యుల భజన పాటలతో సిద్దులగుట్ట మారుమోగిపోయింది. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మి రవి, బట్టు శంకర్, ఖాందేశ్ శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మంజుల మురళి, హజారి సతీష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్, సిద్దుల గుట్ట సేవాసమితి ప్రతినిధులు, పిప్రిగల్లి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



గోదావరికి హారతి

రెంజల్(బోధన్): శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని గోదావరి నదికి హారతి అందించారు. ఈసందర్భంగా నదికి ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేత్రి సురేష్, డీలర్ రవీంద్రబాబు, నూనేల సతీష్, జల్ల శ్రీనివాస్, శివానంద్, శివ, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్తం

దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలి

బోధన్: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు.సాలూర మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. తహసీల్దార్ శశిభూషణ్‌తో రెవెన్యూ దరఖాస్తుల పరిష్కార పురోగతిపై సమీక్షించారు. ఎంఆర్‌ఐ ఆనంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పదో తరగతి టాపర్లకు నగదు ప్రోత్సాహకం

పెర్కిట్(ఆర్మూర్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య, సంజనకు సోమవారం గ్రామానికి చెందిన ముత్యాల రాజారెడ్డి స్మారకార్థం వారి మనవడు రాంరెడ్డి రూ.3 వేల, రూ.2 వేల చొప్పున నగదు పారితోషకాన్ని అందజేశారు. హెచ్‌ఎం విశ్వనాథ్, టీచర్లు ఉన్నారు.

కథల పోటీల్లో జాతీయస్థాయిలో ప్రతిభ

వర్ని: మండలంలోని వడ్డేపల్లి హైస్కూల్ విద్యార్థిని నిఖిత జాతీయస్థాయి కథల పోటీల్లో మూడో బహుమతిని సాధించినట్లు హెచ్‌ఎం చంద్రకరణ్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. ఉరిమల్ల ఫౌండేషన్ ఖమ్మం వారు ఇటీవల జాతీయస్థాయిలో కథలు, కవితల పోటీలు నిర్వహించగా నిఖిత పాల్గొని, ప్రతిభ చాటిందన్నారు. విజేతలకు ఈనెల 24న ఖమ్మంలో బహుమతులు అందజేస్తారని ఆయన వెల్లడించారు.

క్షయ రోగులకు న్యూట్రిషన్ కిట్ల అందజేత

వేల్పూర్: వేల్పూర్ పీహెచ్‌సీలో సోమవారం క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వం సరఫరా చేసిన న్యూట్రిషన్ కిట్లను వైద్యాధికారిణి వీణ అందజేశారు. సీహెచ్‌వో నారాయణ, సూపర్‌వైజర్లు గౌస్, ఎస్తేర్, తబిత ఉన్నారు.

బోధన పరికరాల ప్రదర్శన

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం మండలస్థాయి టీఎం మేళా నిర్వహించారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు టీచింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారని ఎంఈవో తెలిపారు.

మోర్తాడ్: మోర్తాడ్ ఉన్నత పాఠశాలలో సోమవారం బోధన పరికరాల మేళా నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు వారు బోధించే సబ్జెక్టులకు సంబంధించి పరికరాలను ప్రదర్శించారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించి రెండు టీఎల్‌ఎంలను జిల్లాకు పంపించనున్నట్లు ఎంఈవో సమ్మిరెడ్డి తెలిపారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పెర్కిట్(ఆర్మూర్): కూరగాయలు, పండ్ల సాగు చేపట్టే రైతులు ఉద్యానవన శాఖ ద్వారా అందజేస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఉద్యానవన శాఖ అధికారిణి సంధ్యరాణి ఒక ప్రకటనలో కోరారు. పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయలు సాగు చేసే రైతులకు అర ఎకరానికి రూ.50 వేలు రాయితీ, అలాగే టమాట, వంగ, మిరప నారును ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8977713980ను సంప్రదించాలన్నారు.

జలాల్‌పూర్‌లో సంపర్క్ అభియాన్

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం సంపర్క్ అభియాన్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు అంబటి నవీన్, గ్రామ అధ్యక్షుడు జక్క శ్రీనివాస్, నాయకులు సాయికిరణ్, నర్సయ్య, సత్యనారాయణ తోపారం అశోక్ ఉన్నారు.